
# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ౹ 25 ౹ ఏప్రిల్ ౹ 2025



**సోమశిలలో 51.43 టీఎంసీలు**

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 51.43 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 280 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.99,650 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.9,046 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.9,317 |
| నవర (8 గ్రా) | రూ.74,536 |

గరిష్ఠం/కనిష్ఠం
40.6 /27.5

**వాతావరణం**

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు శుక్రవారం కూడా కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 57 శాతంగా గురువారం నమోదైంది.

# కోటాకు కోత



కూటమి ప్రభుత్వం చివరికి పేదోడి నోటికాడ ముద్ద కూడా లాగేస్తోంది. పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం కేటాయింపులకు కొన్ని నెలలుగా కోతలు పెడుతోంది. సివిల్ సప్లయ్స్ గోడౌన్లలో బియ్యాన్ని స్థానిక ఎమ్మెల్యేల అండతో టీడీపీ నేతలు దోచుకోవడంతోనే ఈ పరిణామాలు ఎదురవుతున్నాయని ఆ శాఖాధికారులు వాపోతున్నారు. మరోవైపు నెల నెలా నూరు శాతం రేషన్ పంపిణీ చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తుండటం విశేషం.

- రేషన్ బియ్యం అందక కార్డుదారుల అవస్థ
- అన్ని షాపుల పరిధిలో ఇదే పరిస్థితి
- కేటాయించాల్సింది 12,500 మెట్రిక్ టన్నులు
- కానీ ప్రతి నెలా కోతే

**నాలుగు నెలల్లో జిల్లాలో పరిస్థితి**

| నెల | అలాట్‌మెంట్ (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|
| జనవరి | 10,200 |
| ఫిబ్రవరి | 9,963.914 |
| మార్చి | 9,963.733 |
| ఏప్రిల్ | 9,710.671 |

నెల్లూరు (పొగతోట): దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న పేదల ఆకలి తీర్చేందుకు ప్రతి కార్డుదారుడికి కేంద్రం 80 శాతం సబ్సిడీతో రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల కడుపులు కొట్టి.. ఎమ్మెల్యేల నుంచి టీడీపీ నేతల వరకు ఆ బియ్యాన్ని కొల్లగొడుతున్నారు. ప్రతి షాపు కోటాలో కోత విధించడంతో పూర్తిస్థాయిలో రేషన్ అందక కార్డుదారులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 7.21 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ప్రతి నెలా 12,500 మెట్రిక్ టన్నుల రేషన్‌ను విడుదల చేయాల్సి ఉండగా, గత నాలుగు నెలల నుంచి కోత విధిస్తున్నారు. జిల్లాలో 1,523 రేషన్ షాపులున్నాయి.

**అంతా గోల్‌మాల్**

జిల్లాలో నాలుగు నెలలుగా రేషన్ అలాట్‌మెంట్స్ పరిశీలిస్తే.. అంతా గోల్‌మాల్ వ్యవహారం కనిపిస్తోంది. వాస్తవ కేటాయింపులకు 80 శాతం కూడా సరఫరా చేయడం లేదు. చౌకదుకాణాలకు సంబంధించి ప్రతి నెలా పది టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. ఆయా షాపులకు ప్రతి నెలా సరఫరా చేసే కేటాయింపులో కార్డుదారులకు పంపిణీ చేయగా, మిగిలిన స్టాక్‌ను పరిగణనలోకి తీసుకొని, మరుసటి నెలలో ఆ స్టాక్‌తో కలుపుకొని బియ్యం సరఫరా చేస్తారు. ఉదాహరణకు ఒక రేషన్ షాపునకు 10 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తే.. అందులో 9 టన్నులు సరఫరా అయితే మిగిలిన టన్ను స్టాక్‌ను మినహాయించి మరుసటి నెల్లో 9 టన్నులను సరఫరా చేస్తారు. రకరకాల కారణాలతో ఆ షాపునకు కేటాయించాల్సిన మేరకు బియ్యాన్ని సరఫరా చేయడం లేదని డీలర్లు వాపోతున్నారు.

**నిబంధనల మేరకే అలాట్‌మెంట్**

చౌకదుకాణాలకు నిబంధనల మేరకు ఆన్‌లైన్లో డేటాను పరిశీలించి రేషన్‌ను కేటాయిస్తున్నాం. గత నెల్లో మిగులు బియ్యం, వాటి వివరాలను పరిశీలించి రేషన్‌ను విడుదల చేస్తున్నాం. రేషన్లో కోతకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారించి చర్యలు చేపడతాం. కార్డుదారులు ఇబ్బందులు పడకుండా సరఫరా చేస్తున్నాం. కార్డుదారులకు ప్రతి నెలా 20 వరకు రేషన్‌ను సరఫరా చేసేలా చర్యలు చేపట్టాం.

– విజయకుమార్, డీఎస్‌ఓ

కలువాయి మండలం తిరుమలపాడు చౌకదుకాణానికి 4.5 టన్నుల రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఈ నెల్లో 200 కిలోలనే సరఫరా చేశారు. ఎవరికి పంపిణీ చేయాలో అర్థం కాక డీలర్ లబోదిబోమంటున్నారు.

కలువాయి మండలం వెంకిరెడ్డిపల్లి రేషన్ దుకాణానికి ఉన్న అలాట్‌మెంట్‌లో 900 కిలోల బియ్యాన్ని తక్కువగా సరఫరా చేశారు.

నెల్లూరులోని వేదాయపాళెంలో ఓ చౌకదుకాణానికి మూడు టన్నుల కోత విధించారు.

ఏసీనగర్, ఎన్టీఆర్ నగర్, నవాబుపేటలోని చౌకదుకాణాల్లో ఒక్కో షాపునకు టన్నుకు పైగా కోత విధించారు.



**6ఏ కేసులంటూ..**

6ఏ కేసులు, నిల్వ ఉన్న బియ్యం, తదితర కారణాలు పరిశీలించి రేషన్‌ను విడుదల చేస్తున్నామని అధికారులు సమాధానమిస్తున్నారు. అధికారులు చెప్పున్న దానికి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు పొంతనే ఉండటం లేదు. చౌక దుకాణాల్లో మిగులు బియ్యం ఆధారంగా మరుసటి నెల్లో అలాట్‌మెంట్ చేయాల్సి ఉంది. సంబంధిత సివిల్ సప్లయ్స్ డీటీలు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు చౌకదుకాణాల స్టాక్ వివరాలను పంపించాల్సి ఉంది. అయితే చౌకదుకాణాల్లో నిల్వ ఉన్న బియ్యం వివరాలను సేకరించడంలో అధికారులు చేస్తున్న పొరపాట్లు, నిర్లక్ష్యం కారణంగా రేషన్లో కోత పడుతోందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పోర్టబులిటీ అధిక శాతం వినియోగించడంతో డీలర్ల వద్ద ఉన్న బియ్యం అర్హులైన ఖాతాదారులకు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనేక చౌకదుకాణాల్లో 200 నుంచి 300 కార్డులకు పైగా పోర్టబులిటీ ఇస్తున్నారు. ఎమ్మెల్‌ఎస్ పాయింట్ల నుంచి ప్రతి నెలా చౌకదుకాణాలకు రేషన్ సరఫరా చేస్తారు. బినామీ కార్డులకు సంబంధించిన బియ్యాన్ని ఎమ్మెల్‌ఎస్ పాయింట్ల నుంచే నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీలర్లు అక్రమ మార్గంలో బియ్యాన్ని తరలించడం ద్వారా కార్డుదారులకు రేషన్ అందడం లేదనే విమర్శలున్నాయి.

## న్యూస్‌రీల్

### మద్యం పాలసీపై బాబుది బూటకపు ప్రచారం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులతో తీసుకొచ్చిన మద్యం పాలసీపై చంద్రబాబు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్‌లో కేసు నమోదు చేసి, అక్టోబర్‌లో 20 డిస్టిలరీలపై దాడులు జరిపి ఎనిమిది నెలల పాటు సీఐడీ విచారణ జరిపినా ఒక్క సాక్ష్యాన్ని సైతం సంపాదించలేకపోయారని చెప్పారు. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌రెడ్డి వద్ద తప్పుడు వాంగ్మూలాలను నమోదు చేసి, వాటి ఆధారంగా కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఇదే వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో నాటి టీడీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో చంద్రబాబును ఏ – 3గా పేర్కొంటూ సీఐడీ కేసు నమోదు చేసిన అంశాన్ని ప్రస్తావించారు. ఈ కేసును పక్కదోవ పట్టిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. 43 వేల బెల్టుషాపులను తమ ప్రభుత్వ హయాంలో రద్దు చేశారని గుర్తుచేశారు. అప్పట్లో పారదర్శకంగా విక్రయాలు జరిగాయని, ఈ వివరాలు ప్రస్తుత ప్రభుత్వం వద్ద ఉన్నా, ఆ విధానాన్ని ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి 20 వేల మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. నూతన మద్యం పాలసీలో కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడటమే కాకుండా విక్రయాలను విచ్చలవిడి చేసిందని ఆరోపించారు. దీని వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### రేపట్నుంచి స్లాట్ బుకింగ్


నెల్లూరు సిటీ: జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ శనివారం నుంచి ప్రారంభంకానుందని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రక్రియ ఈ నెల నాలుగున ప్రారంభమైందని, తాజాగా మిగిలిన కార్యాలయాల్లోనూ షురూ కానుందని చెప్పారు.

### కొవ్వొత్తుల ర్యాలీ



నెల్లూరు( వీఆర్సీసెంటర్): కశ్మీర్‌లో ఉగ్రవాదులు కాల్పులు జరిపి 27 మంది పర్యాటకులను బలి తీసుకోవడం అమానుషమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నేతలు మూలం రమేష్, మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, గోగుల శ్రీనివాసులు, చెంగయ్య, రెహనాబేగం, కొండా ప్రసాద్, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

### దౌర్జన్యాలతో కలాలకు కళ్లెం వేయలేరు



మనుబోలు: దాడులు, దౌర్జన్యాలతో జర్నలిస్టుల కలాలకు కళ్లెం వేయలేరని గూడూరు ప్రింట్ మీడియా డివిజన్ ఉపాధ్యక్షుడు బాబు మోహన్‌దాస్ పేర్కొన్నారు. ఏలూరులోని సాక్షి కార్యాలయంపై ఎమ్మెల్యే చింతమనేని అనుచరులు మంగళవారం దాడికి పాల్పడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన ఘటనపై నిరసనను గురువారం వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ బషీర్‌కు మనుబోలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తమకు నచ్చిన విధంగా వార్తలు రాయలేదనే కారణంతో జర్నలిస్టులు, మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం రాజకీయ నేతలు, వారి అనుచరులకు పరిపాటిగా మారిందని చెప్పారు. సాక్షి కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించారు. మీడియా ప్రతినిధులు జగదీష్‌బాబు, సుధాకర్, శ్రీనివాసులు, బాషా, శంకర్, సాయి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్.. భూచోళ్లు



తెలుగురాయపురంలో కబ్జాకు సిద్ధంగా ప్రభుత్వ భూమి

కూటమి సర్కార్ కొలువుదీరిన నాటి నుంచి ప్రభుత్వ భూములను కొల్లగొట్టడంలో తెలుగు తమ్ముళ్లు తలమునకలై ఉన్నారు. ప్రభుత్వ పెద్దల సహకారం ఉండటంతో వీరు పేట్రేగిపోతున్నారు. కోట్ల రూపాయలు అప్పనంగా వచ్చే అవకాశం ఉండటంతో అధికారుల అండదండలతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి వీటిని కాజేసేందుకు స్కెచ్ వేస్తున్నారు. కలువాయి మండలంలో స్థానిక ఎమ్మెల్యే, ఆయన అనుచరవర్గం ఈ దురాగతానికి పాల్పడుతోంది.

- నేషనల్ హైవే వస్తుందనే సమాచారంతో గద్దల్లా వాలి..
- తెలుగురాయపురంలో ప్రభుత్వ భూములు కాజేసేందుకు కుట్ర
- నకిలీ పత్రాలు సృష్టించిన తెలుగు తమ్ముళ్లు
- 130 ఎకరాల స్వాధీనానికి కుయుక్తులు
- వెంకటగిరి ఎమ్మెల్యే అనుచరుల ధనదాహం

సాక్షి టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలం తెలుగురాయపురంలో భూచోళ్లు వాలిపోయారు. ఇక్కడి ప్రభుత్వ భూములను కొట్టేసే ప్రక్రియకు తెరలేపారు. వాస్తవానికి గ్రామ రెవెన్యూ రికార్డుల మేరకు 585 / 2, 586 / 1, 590 / 3, 593 / 1, 576, 577, 578 తదితర సర్వే నంబర్లలో 130 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఈ క్రమంలో అదే మండలంలోని రాజుపాళేనికి చెందిన టీడీపీ నేత వెంకటసుబ్బరాజు ఇతర మండలాల్లో ఉన్న 26 మంది బంధువర్గం పేర్లతో డీ – ఫారమ్ పట్టాలను 2013లో పొందారు. నిజానికి పేద రైతు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం 2.5 ఎకరాలనే అందజేస్తుంది. అయితే ఇక్కడ లబ్ధిదారులకు ఒక్కో పేరుతో పదెకరాలను పట్టాల రూపంలో పంపిణీ చేశారంటే భూ దందా ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో పశువుల మేత భూములను టీడీపీ నేత కాజేస్తున్నారనే విషయం వెలుగులోకి రావడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. వీటి జోలికొస్తే అంగీకరించమని స్పష్టం చేయడంతో మిన్నకుండిపోయారు. అయితే ఎలాగైనా స్వాహా చేయాలనే లక్ష్యంతో సదరు నేత వ్యవహరించారు. ఈ తరుణంలో భూ హద్దులు చూపి స్వాధీనం చేయించాలని కోరుతూ హైకోర్టును డీ – ఫారం పట్టాలు పొందిన తన బినామీ లబ్ధిదారులతో ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయస్థానంలో ఉంది.

**నయా నాటకం షురూ..**


కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో పాటు ఆయన ప్రధాన అనుచరులు, పట్టా పొందిన వెంకటసుబ్బరాజుతో కలిసి ఆయా భూములను చేజిక్కించుకునేందుకు కొత్త పన్నాగానికి తెరలేపారు. రెవెన్యూ కార్యాలయంలో ఉన్న పాత డీ – రిజిస్టర్‌ను మాయం చేసి కొత్త రిజిస్టర్‌లో తమకు అనుకూలమైన పేర్లను నమోదు చేయించారు. వీరికి డీ – ఫారమ్ పట్టాలున్నాయంటూ నకిలీ పత్రాలను సృష్టించి వాటిని ఫ్రీ హోల్డ్‌లో వచ్చేలా చేశారు. వన్‌బీ, అడంగల్లోనూ వారి పేర్ల నమోదుకు రంగం సిద్ధం చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అడ్డదారులు తొక్కుతున్నారు. రికార్డులపరంగా అన్ని వ్యవహారాలను అధికారులు చక్కబెట్టారనే ప్రచారం జరుగుతోంది.

**మాయాజాలం..**

తెలుగురాయపురంలోని 187 / 5, 565 / 3, 597 / 2, 597 / 1 సర్వే నంబర్లలో 14 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టారు. మిగిలిన వాటి పట్టా పేర్లను మార్చేందుకు రంగం సిద్ధం చేశారు. 597 / 1లో సిద్ధిరాజుకు 2.67 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. అదే పేరుతో సర్వే నంబర్ 592 / 3లో 2.3 ఎకరాలు డీ పట్టాగా ఉంది. ఈ వ్యవహారంలో అధికారులు సహకరిస్తున్నారు.

**పెరిగిన భూముల ధరలు**

తెలుగురాయపురం మీదుగా నేషనల్ హైవే నిర్మాణానికి భూసేకరణ జరిగింది. ఈ సమాచారంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరా రూ.20 లక్షలు పలుకుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కన్ను వీటిపై పడింది. కోట్ల విలువజేసే భూములను కాజేసేందుకు టీడీపీ గ్రామ నేతలతో కలిసి బినామీ పట్టాదారుల ద్వారా అగ్రిమెంట్లు చేయించుకున్నారు. త్వరలోనే రికార్డులు మార్చి రిజిస్ట్రేషన్లు చేయించి.. ఆపై స్వాధీనం చేసుకునే యత్నాల్లో ఉన్నారు. ఈ భూ కబ్జాలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వందలాది ఎకరాలను మండల రెవెన్యూ అధికారుల సహకారంతో ఎమ్మెల్యే అండతో కాజేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. వీటిని కాపాడి గ్రామావసరాలు లేదా పేదలకు పంపిణీ చేయాలని కోరారు.



ప్రభుత్వ భూమిగా చూపుతున్న రికార్డులు

**ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి**

తెలుగురాయపురంలో 130 ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. భూములను పరిరక్షించేలా చర్యలు చేపడతాం.

– శ్యామ్‌సుందర్, తహసీల్దార్, కలువాయి

# కావలి కన్నీటిసంద్రం



గుండెలవిసేలా రోదిస్తున్న భార్యాపిల్లలు



విలపిస్తున్న తండ్రి, తోబుట్టువు



నివాళులర్పిస్తున్న పవన్ కల్యాణ్

- అశ్రునయనాల మధ్య మధుసూదన్ అంతిమయాత్ర
- నివాళులర్పించిన ప్రజానీకం

కావలి: విహారయాత్ర నిమిత్తం కుటుంబసమేతంగా కశ్మీర్‌లోని పహల్గామ్ వెళ్లి ఉగ్రవాదుల తూటాకు బలైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సోమిశెట్టి మధుసూదన్ భౌతికకాయం కావలికి గురువారం ఉదయం చేరుకుంది. శ్రీనగర్ నుంచి విమానంలో చెన్నై ఎయిర్‌పోర్టుకు తెల్లవారుజామున మూడు గంటలకు.. ఆపై రోడ్డు మార్గంలో అంబులెన్స్ ద్వారా పట్టణంలోని ఆనాలవారి వీధిలోని స్వగృహం వద్దకు చేరింది. అప్పటికే అక్కడ ఉన్న తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, తోబుట్టువులు, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. పార్థివదేహ పేటికను ఇంట్లోకి పోలీస్ అధికారులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి భుజాలపై మోసి చేర్చారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. పార్థివదేహంపై జాతీయ జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబీకులను ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఓదార్చారు.

**కన్నీటిపర్యంతం**

కావలిలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మధుసూదన్ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆత్మీయులు విలపించారు. అక్కడున్న ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి. మృతుడి భార్య, పిల్లలు రోదన అక్కడి వారిని కలిచివేసింది. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ నివాళులర్పించారు. పేద కుటుంబం నుంచి ఉన్నతంగా ఎదిగి.. మంచి వ్యక్తిత్వం గల మధుసూదన్ మృతి చెందడం దురదృష్టకరమని ఎమ్మెల్యే చెప్పారు.



అంతిమయాత్రకు ఏర్పాటు చేసిన వాహనం

**మంత్రుల నివాళులు**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కావలి చేరుకొని మధుసూదన్ భౌతికకాయానికి పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి.. ధైర్యంగా ఉండాలని సూచించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌యాదవ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

**అంతిమయాత్ర**

పట్టణంలోని ఆనాలవారి వీధిలోని తల్లిదండ్రుల నివాసం నుంచి మధుసూదన్ అంతిమ యాత్ర ప్రారంభమైంది. నాలుగు కిలోమీటర్ల దూరంలోని బుడంగుంట శ్మశాన వాటిక వరకు సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పార్థివదేహాన్ని ఉంచారు.

**బాధాకరం**



మధుసూదన్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఉగ్రవాదుల కిరాతకానికి సోమిశెట్టి మధుసూదన్ బలవడం బాధాకరమని రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చదువు పూర్తవ్వగానే అమెరికాలో ఆయన ఉద్యోగం చేశారని, అయితే విదేశాల్లో ఎందుకు మన దేశంలోనే చేయాలని తల్లిదండ్రులు కోరారని, దీంతో బెంగళూరులో విధులు నిర్వర్తిస్తూ అక్కడే స్థిరపడ్డారన్నారు. ఆయన కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. తెలంగాణకు చెందిన వ్యక్తులు ఉగ్రదాడులకు బలైతే వారి కుటుంబాలకు రూ.నాలుగు కోట్ల ఆర్థిక సాయాన్ని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అందించిందని, ఇదే తరహాలో చంద్రబాబు సర్కార్ వ్యవహరించాలని కోరారు.

# ప్రణాళిక లేక.. పర్యవేక్షణ కరువై..

- దిగజారిన పది ఫలితాలకు బాధ్యులెవరు?
- ప్రభుత్వ యాజమాన్యాల్లో 3,961 మంది ఫెయిల్
- 370కి పైగా హైస్కూల్స్‌లో 23 చోట్లే వంద శాతం ఫలితాలు
- 18 మున్సిపల్ స్కూళ్లలో అయితే నిల్
- ప్రహసనంగా సబ్జెక్ట్ టీచర్ల సర్దుబాటు


జిల్లా విద్యాశాఖ కార్యాలయం

నెల్లూరు(టౌన్): పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ, ప్రణాళిక లోపం స్పష్టంగా కనిపించింది. గతేడాది కంటే ఈసారి 4.59 శాతం వెనుకబడింది. విద్యార్థులను సబ్జెక్ట్ టీచర్ల కొరత వేధించింది. ఎస్‌ఏ – 1 పరీక్ష సమీపించినా పైనుంచి ఆదేశాలు లేవన్న కారణంతో సర్దుబాటు చేయని పరిస్థితి. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చినా రకరకాల కొర్రీలతో ఆ ప్రక్రియ నెలరోజులకు పైగానే సాగింది. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో టీచర్లను సర్దుబాటు చేస్తామని ప్రకటించారు. అయితే చివరకు జిల్లా స్థాయిలో చేయకుండా వదిలివేశారు. 353 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 545 మంది సబ్జెక్ట్ టీచర్లను మాత్రమే సర్దుబాటు చేశారు. అప్పటికే విద్యార్థులకు జరగాల్సిన నష్టం జరిగింది. సిలబస్ పూర్తి చేయడంలో ప్రైవేట్ పాఠశాలలు కంటే ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా వెనుకబడ్డాయి. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఎంఈఓ, డిప్యూటీ డీఈఓల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. మొక్కుబడిగా స్కూళ్లకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయంటున్నారు.

**భారీగా..**

పదో తరగతిలో ప్రభుత్వ యాజమాన్యాల్లోని ఆయా పాఠశాలల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,961 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. జిల్లాల్లో మొత్తం 370కి పైగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిల్లో 15,594 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. భారీ సంఖ్యలో ఫెయిల్ కావడానికి కారణం సకాలంలో టీచర్ల సర్దుబాటు చేయకపోవడం, సిలబస్‌ను పూర్తి చేయకపోవడంతోపాటు రివిజన్ కూడా అంతంత మాత్రంగానే జరిగినట్లు చెబుతున్నారు.

**కేవలం 23 బడుల్లోనే..**

జిల్లా వ్యాప్తంగా కేవలం 23 పాఠశాలల్లోనే 100 శాతం ఫలితాలు వచ్చాయి. అది కూడా తక్కువ మంది ఉన్నచోటే వచ్చినట్లు తెలిసింది. అదే ప్రైవేట్ విభాగంలో 83 పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు వచ్చాయి. జిల్లాలో 18 మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలున్నా ఒక్కచోట కూడా వంద శాతం ఫలితాలు రాలేదు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రిగా జిల్లాకు పొంగూరు నారాయణ ఉన్నారు. ఆయన నిత్యం పర్యవేక్షించే నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోనే 15 స్కూళ్లు ఉన్నాయి. నగరానికి వచ్చినప్పుడల్లా బడులకు వెళ్లి హడావుడి చేస్తుంటారు. అయినా ఒక్క స్కూల్లో కూడా వంద శాతం ఫలితాలు రాకపోవడం ఆలోచించాల్సిన విషయం. మున్సిపల్ విభాగానికి సంబంధించి 67.15 శాతమే నమోదైంది. జిల్లాలో 260కి పైగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నా ఈ విభాగంలో కేవలం 16 చోట్ల నూరుశాతం ఫలితాలొచ్చాయి. ఉన్నత పాఠశాలలు జిల్లా పరిషత్ యాజమాన్యంలోనే ఎక్కువగా ఉన్నాయి. ప్రైవేట్ స్కూళ్లలో పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం 94.63గా ఉంది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పూర్తి స్థాయిలో క్వాలిఫైడ్ టీచర్లున్నారు. ప్రైవేట్‌లో అంతంతమాత్రమే. అయినా ఇక్కడ ఉత్తీర్ణత శాతం పెరగడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడటం, ముందుగానే ప్రణాళిక నిర్వహించుకోకపోవడం వల్లే ఈ ఫలితాలు వచ్చినట్లు చెబుతున్నారు.

**మెరుగైన ఫలితాలు సాధిస్తాం**

పది ఫలితాల్లో స్టేట్ యావరేజ్ తగ్గింది. అయినా దాని కంటే జిల్లా యావరేజ్ 2 శాతం ఎక్కువ ఉంది. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతికి ముందస్తు ప్రణాళిక రచించుకుని మెరుగైన ఫలితాలు సాధిస్తాం. జిల్లాలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపడతాం.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు, ఎస్సై బాలకృష్ణ


# గంజాయి ముఠా అరెస్ట్

- ఒడిశా నుంచి దిగుమతి
- చిన్న ప్యాకెట్లు చేసి విక్రయాలు

నెల్లూరు(క్రైమ్): ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఐదుగురు సభ్యుల ముఠాను నెల్లూరు సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం సంతపేట పోలీస్‌స్టేషన్లో నగర డీఎస్పీ పి.సింధుప్రియ స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.దశరథరామారావుతో కలిసి వివరాలను వెల్లడించారు. ఇటీవల నెల్లూరు నగరంలో మత్తులో నేరాలు జరుగుతుండటంతో ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈక్రమంలో పొర్లుకట్ట నుంచి పెన్నా నదికి వెళ్లే రహదారిలో ఈనెల 23వ తేదీన గంజాయి విక్రయాలు సాగుతున్నాయని ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందింది. ఆయన, ఎస్సై బాలకృష్ణ, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పదంగా ఉన్న నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటకు చెందిన రంజిత్ నాయక్, భానుప్రకాష్, నెల్లూరు ప్రగతినగర్ తొమ్మిదో వీధికి చెందిన పాత నేరస్తుడు షేక్ హుస్సేని అలియాస్ హుస్సేన్, ప్రగతి నగర్ ఐదో వీధికి చెందిన పాత నేరస్తుడు షేక్ రఫీ అలియాస్ గాంధీ, వెంకటేశ్వరపురానికి చెందిన పి.వంశీకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా విక్రయాల గుట్టును వెల్లడించారు.

**వ్యసనాలకు బానిసై..**

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపూర్ గ్రామానికి చెందిన రంజిత్ నాయక్ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరుకు వచ్చాడు. నారాయణరెడ్డిపేటలో ఉంటూ రైస్‌మిల్లుల్లో కూలి పనులు చేసేవాడు. అతడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో డబ్బు కోసం గంజాయి విక్రయాలకు తెరలేపాడు. ఒడిశా రాష్ట్రంలో కేజీని రూ.5 వేలకు కొనుగోలు చేసి నెల్లూరుకు తీసుకొచ్చి తనకు తెలిసిన వారైన హుస్సేని, రఫీ, భానుప్రకాష్, వంశీకృష్ణకు రూ.20 వేల చొప్పున విక్రయించేవాడు. వారు చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కోదానిని రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. వారికి ఒక కేజీపై రూ.30 వేల వరకు లాభం వచ్చేది. వ్యాపారం లాభసాటిగా ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నారు. నిందితులు నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేశామని డీఎస్పీ చెప్పారు. హుస్సేని, రఫీలు పాత నేరస్తులని, వారిపై పలు కేసులున్నాయన్నారు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెచ్‌సీలు సుబ్బారావు, మల్లికార్జున, విజయమోహన్, పీసీలు అల్లాభక్షు, ఎం.వెంకటేశ్వర్లు, జి.గోపీలను ఆమె అభినందించారు.

## క్లుప్తంగా

### రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం

నెల్లూరు(టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలకు సంబంధించి అభ్యాసకులు జవాబుపత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు వచ్చేనెల 5వ తేదీలోపు ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించవచ్చని డీఈఓ ఆర్.బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్ సబ్జెక్ట్‌కు రూ.200లు, వెరిఫికేషన్‌కు సబ్జెక్ట్‌కు రూ.1,000లు చెల్లించాలన్నారు. ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు వచ్చేనెల 19 నుంచి 24వ తేదీ వరకు, ప్రాక్టికల్స్ వచ్చేనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు.

### 29వ తేదీలోపు ఫీజు చెల్లించాలి

నెల్లూరు(టౌన్): డీఈడీ నాలుగో సెమిస్టర్ 2023 – 25 బ్యాచ్ విద్యార్థులు ఈనెల 29వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ ఆర్.బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50ల ఫైన్‌తో అయితే వచ్చేనెల 7వ తేదీ వరకు చెల్లించే అవకావం ఉందన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.250లు చెల్లించాలని తెలియజేశారు.

### కండలేరులో 45.615 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 45.615 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 310, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

# మలేరియాతో ఆరోగ్యానికి ముప్పు

- సకాలంలో చికిత్స తప్పనిసరి
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం



నెల్లూరు(అర్బన్): దోమ కాటు వల్ల వచ్చే మలేరియా అనే జబ్బుతో ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది. చలి, వణుకుతో కూడిన జ్వరం రావడమే కాకుండా కొన్ని సందర్భాల్లో మెదడుకి పాకి ప్రాణాంతకంగా మారుతోంది. దీంతో రోగి వైద్యానికి ఒక్కో దఫా రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అయినా కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది ఏప్రిల్ 25వ తేదీన అన్ని దేశాల్లో జరుపుకోవాలని పిలుపునిచ్చింది. మలేరియా అంతం మనతోనే అనే థీమ్‌ను ఈ సంవత్సరం ప్రకటించింది. శుక్రవారం జిల్లాలో వైద్యులు, వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు.

**జిల్లాలో వందలాది కేసులు**

కొన్ని సంవత్సరాల నుంచి మలేరియా కేసులు తగ్గాయి. అయినా వందలాదిగా కేసులు ప్రతి సంవత్సరం నమోదవుతున్నాయి. ప్రధానంగా రాపూరు, సీతారామపురం తదితర ప్రాంతాల్లో గతంలో ఎక్కువగా వచ్చాయి. నెల్లూరు నగరంలోనూ మలేరియా వ్యాప్తి ఎక్కువగానే ఉంది. వైద్యశాఖలో పరిశీలిస్తే జిల్లాలో మలేరియా కేసులు దాదాపు లేవనేది అధికారుల మాట. అయితే ఉదాహరణకు నెల్లూరు విజయమహల్ గేట్ సమీపంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరిశీలిస్తే గణాంకాల్లో తేడా ఉన్నట్టు తెలుస్తోంది. ఒక్కచోటే పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. మిగతా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో లెక్కలు తీస్తే వందలాది కేసులుంటాయి. అయితే వైద్యశాఖ మాత్రం జిల్లా అంతటా కలిపి రెండో, మూడోగా నిర్ధారణ చేయడం దారుణమనే వాదన ఉంది.

**చాలా డేంజర్**

ప్లాస్మోడియం వైవాక్స్ కన్నా ప్లాస్మోడియం ఫాల్సీపరం అనే పరాన్న జీవి ద్వారా వచ్చే మలేరియా డేంజర్. ఒక్కోదఫా మెదడుకు కూడా వ్యాపించి మనిషి మరణించిన సంఘటనలు జిల్లాలో ఉన్నాయి. రక్తపరీక్షలో వైవాక్స్ మలేరియా అయితే రెండు వారాలు పూర్తిగా చికిత్స తీసుకోవాలి. ఫాల్సీఫారం మలేరియా అయితే 3 రోజులు ఏసీటీ చికిత్స తీసుకోవాలి. ప్రభుత్వాస్పత్రుల్లో ఈ చికిత్సను ఉచితంగా పొందవచ్చు. మలేరియా రాకుండా ఉండాలంటే దోమలు పుట్టకుండా.. కనీసం కుట్టకుండా చూసుకోవాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**జిల్లాలో కేసులిలా..**

| సంవత్సరం | ప్రభుత్వ లెక్కలు | ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో... |
|---|---|---|
| 2021 | 12 | 63 |
| 2022 | 3 | 56 |
| 2023 | 1 | 62 |
| 2024 | 6 | 73 |
| 2025 | 1 | 39 |

**డ్రైడేను పాటించాలి**



ఇంటి లోపల బిందెలు, తొట్టెల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వారానికి ఒకరోజును డ్రైడేగా పాటించి నీటి తొట్టెలను, పాత్రలను శుభ్రపరిచి ఎండబెట్టాలి. అలాగే ఇంటి పరిసరాల్లో ఉండే ప్లాస్టిక్ మూతలు, రబ్బర్ టైర్లు, టెంకాయ చిప్పలు లాంటి వాటిలో కూడా కొద్దిపాటి నీరు కూడా నిల్వ ఉండకుండా శుభ్ర పరుచుకోవాలి. అప్పుడు దోమల నియంత్రణ జరుగుతుంది. అలాగే దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలి.

– ఈ.హుస్సేనమ్మ, జిల్లా మలేరియా నివారణాధికారిణి

# బ్లేడుతో భార్య గొంతు కోసి..

- సైదాపురం మండలంలో ఘటన

సైదాపురం: భార్యాభర్తల మధ్య విభేదాలతో ఓ వ్యక్తి బ్లేడుతో భార్య గొంతు కోశాడు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాపురం ఎస్సై క్రాంతి కుమార్ కథనం మేరకు.. కడప పట్టణంలోని శివానందపురానికి చెందిన ఊటుకూరు విష్ణుకు సైదాపురం మండలంలోని కలిచేడు గ్రామానికి చెందిన ప్రసన్నతో వివాహం జరిగింది. ప్రస్తుతం వారు కలిచేడు గ్రామంలో కాపురం ఉంటున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. విష్ణు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈనెల 22వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో విష్ణు బ్లేడుతో భార్య గొంతుపై, గడ్డంపై, కుడిచేయి భుజంపై కోశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితురాలిని కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసును నమోదు చేసి పరారీ ఉన్న విష్ణు కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గాయపడిన ప్రసన్న

### పేకాట స్థావరంపై దాడులు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని బొమ్మవరం పంచాయతీ పరిధిలో పేకాట స్థావరంపై గురువారం ఆత్మకూరు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మర్రిపాడు స్టేషన్ సిబ్బంది, తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. 12 మంది వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఐదు బైక్‌లు, రూ.69,500ల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంట మర్రిపాడు ఎస్సై శ్రీనివాసులున్నారు.

### వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నెల్లూరు(టౌన్): జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై అభ్యంతరాలను ఈనెల 26వ తేదీలోపు తగిన ధ్రువీకరణపత్రాలతో విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 108 |
| లేయర్ (లైవ్) | : 100 |
| బ్రాయిలర్ చికెన్ | : 198 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 218 |
| లేయర్ చికెన్ | : 170 |

# సహకార రంగంలో కొనసాగించాలి


మాట్లాడుతున్న నాయకులు

కోవూరు: కోవూరు షుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలో కొనసాగించాలని పలువురు నాయకులు కోరారు. గురువారం కోవూరు చక్కెర కర్మాగారం గేట్ ముందు అఖిల భారత చెరకు రైతుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇందులో ఆ సంఘ ప్రధాన కార్యదర్శి రవీంద్రన్ మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సహకార రంగంలోని చెరకు ఫ్యాక్టరీలను కేంద్రమిచ్చే ఆర్థిక సహకారంతో నడుపుతున్నారని, కానీ ఇక్కడ ప్రభుత్వం సహకార రంగంలోని ఫ్యాక్టరీలను అమ్మేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. చెరకుకు మద్దతు ధర ఇవ్వాలని అడుగుతుంటే కేంద్రం అంగీకరించడం లేదన్నారు. తమిళనాడు రైతు సంఘం కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో నేతలు గండవరపు శ్రీనివాసులు, అప్పారావు, సూర్యనారాయణ, రఘురామయ్య, వెంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో డబ్ల్యూహెచ్‌ఓ నిపుణుల సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

సోమశిల: అనంతసాగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమ నిపుణుడు భవానీ రామకృష్ణ గురువారం సందర్శించారు. టీబీ యూనిట్, ట్రూనాట్ ల్యాబ్‌లో పరికరాల పనితీరును పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న క్షయ పరీక్షలపై వైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలోని టీబీ వ్యాధిగ్రస్తుల రికార్డులను పరిశీలించారు. అనుమానిత రోగుల నుంచి సేకరించిన గళ్ల నమూనాలను తనిఖీ చేశారు. టీబీ వ్యాధిగ్రస్తురాలిని పరిశీలించి వైద్యసేవలు ఎలా అందుతున్నాయనే అంశాన్ని ఆరా తీశారు. డాక్టర్ శ్రావణి, ల్యాబ్ టెక్నీషియన్ మీరాన్, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి స్పెషల్ డ్రైవ్


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: జిల్లాలోని 95 వేలకుపైగా ఉన్న నోషనల్ ఖాతాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి నెలరోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జేసీ కార్తీక్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. 1,84,298 సర్వే నంబర్లలో 95,060 నోషనల్ ఖాతాలున్నట్లు చెప్పారు. ముఖ్యంగా అసైన్‌మెంట్ భూములు, రిజిస్టర్ భూములు, చుక్కల భూములు, పౌతి (మరణించిన వారి సంబంధించిన) సాదాబైనామా సంబంధించిన ఖాతాలను పరిశీలించి రెగ్యులర్ చేస్తామన్నారు. 2,37,000 మంది రైతుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తొలిరోజు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎనిమిది మండలాల నేషనల్ ఖాతాలను పరిశీలిస్తామన్నారు.

### వితంతువులకు పెన్షన్లు

నెల్లూరు(పొగతోట): వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓలు, మున్సిపాలిటీల లాగిన్లలో నమోదు చేసుకునేందుకు ఆప్షన్ ఇచ్చారన్నారు. భర్త పింఛన్ తీసుకుంటూ మరణిస్తే గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

### 29, 30 తేదీల్లో వజ్రోత్సవాలు

నెల్లూరు (పొగతోట) : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 29, 30వ తేదీల్లో వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థలం లాంఫామ్‌లో వజ్రోత్సవ వేడుకలు ఉంటాయని, నెల్లూరు జిల్లాలోని ఆసక్తిగల రైతులు నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రం 99896 23828, 79816 44675 నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివజ్యోతి కోరారు. నెల్లూరు నుంచి రెండు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### నిమ్మ ధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.90 |
| సన్నవి | : రూ.65 |
| పండ్లు | : రూ.35 |

